# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్


వాన నిలిచి కురస్తా వుండాది. యాపచెట్టు ముద్దగా తడిసి పోయింది. గడగడా వణకతా వుండాది. రాతి కూసాల సందుల్లో నుంచి వాననీళ్ళు కారతా వుండాయి.

తడవకుండా మెట్లమింద కుర్చోని కాళ్ళని నీళ్ళల్లో పెట్టింది చిలకముక్కు దీపం. నీళ్ళు పరుగులు పెడతా కాళ్ళని గిలిగింతలు పెడతా వుండాయి.

కాళ్ళని నీళ్ళల్లోనుంచి పైకి తీస్తుంది. మళ్లా ముంచుతుంది. తపతపమనినీళ్ళని ఎగరకొడుతుంది. పసిపిలగాడి మాదిరి నీళ్ళతో ఆడుకుంటా వుండాది.

''ఎవరి పిచ్చి వాళ్ళకి ఆనందమంటే ఇదే!'' అనింది చిలకముక్కు దాన్ని చూసి రాశింటిదీపం.

## గిలకోడు




''నిజమే గదా! కొందరికి డబ్బు పిచ్చి. కొందరికి కీర్తి కిరీటాల పిచ్చి, కొందరికి మందు పిచ్చి, కొందరికి మదపిచ్చి. గోపినోళ్ళ ఇంట్లో గిలకోడని ఒక పిచ్చోడు వుండేవాడు. పిచ్చోడేగాని వాడు మహత్యాలు, మాయలు చేసేటోడు'' అనింది గుడిసింటి దీపం.

''పిచ్చోడు గదా! పిచ్చిపనులు చేసినా మహత్యాలూ, మాయలూ చేసినట్టే వుంటుంది'' అనింది మిద్దింటి దీపం.

''నేను చెప్పింది అపద్దంగాదు. పిచ్చోడి కత చెప్తేనేగాని నీకు అర్తం గాదు'' అనింది గుడిసింటి దీపం.

''నువ్వు చెప్పేది పిచ్చికత్తై వుంటుంది'' అని ఎగతాళి చేసింది మిద్దింటి దీపం.

''పిచ్చి కతో, మంచి కతో చెప్పితేగదా తెలిసేది. ఒసేయ్ గుడిసింటిదానా! ముందు నువ్వు కత చెప్పు?'' అనింది పెద్దింటి దీపం.

ఆ మాటతో తలాడిస్తా గిలకోడి కత నెత్తుకునింది గుడిసింటి దీపం.

* * *

తిరపతి దగ్గరుండే ఆరేపల్లిరంగంపేటలో గోపిని కిష్టయ్య పెదనాయన, ఆదెమ్మ పెదమ్మ వుండారు గదా! వాళ్ల పెద్దకొడుకే గిలకోడు. రెండోది అనసూయక్క, మూడు హరెన్న, కడగుట్టిది విజయ.

గిలకోడి అసలు పేరు సుబ్రమన్నెం. గోపినోళ్ళ ఇంట్లో పుట్టిన తొలి మగబిడ్డకి సుబ్రమన్నెస్వామి పేరునే పెడతారు. పుట్టినప్పట్నుంచి అందరి బిడ్డల్లా కాకుండా మతాచారంగా పెరిగినాడు. ఏం చెప్పినా అర్తం చేసుకునేవాడు గాదు. మాటలు గూడా సరిగా తిరిగేవి గాదు.

దానికితోడు వాయిరోగం (మూర్చ) వున్నింది. వాయివస్తే ఎక్కడంటే అక్కడ పడిపొయ్యి కాళ్ళూ చేతులూ కొట్టుకునేవాడు. మెళ్ళో వాయిరోగం వుందని చెప్పి పలకగూడా కట్టినారు.

ఎప్పుడు చూసినా గిలకమాదిరి 'గీ' పెట్టుకుంటా తిరగతా వుండేవాడు. నోటికి ఒగపక్క ఎప్పుడుచూసినా జొల్లు కారతా వుండేది. ఏం పని చేసినా చొక్కాయి గుడ్డ మాత్తరం నోట్లో పెట్టుకుని నమలతా వుండేవాడు.


ఎవురు పెట్టినారో తెలీదు. గిలకోడి మాదిరి 'గీ'పెట్టుకుంటా తిరిగేవాడు కాబట్టీ గిలకోడని పేరు పెట్టినారు. పెట్టుడు పేరే అసలు పేరైంది.

బెమ్మంగారి మఠం నుంచి ఓ సాధువు వచ్చినాడు. ఆయనకి చూపించినారు.

''స్వామీ పుట్టక పుట్టక మగబిడ్డ పుడితే తిక్కలోడు పుట్టినాడు. ఈ బిడ్డ పుట్టేమి సుఖమూ! బతికేమి సుఖమూ!'' అని యాష్టపొయినారు.

''బిడ్డల్ని కనగలరేగాని వాళ్ల రాతల్ని కనలేరుగదా మీరు. తిక్కలోడు పుట్టినాడని గొంతుపిసికి చంపేస్తారా?'' అని చెప్పి జాతకచెక్రం తిరగేసినాడు.

లెక్కలు కట్టి చూసి,



## ఓ ప్రియా...ప్రియా...

యాడ్ ప్రపంచంలో ఇప్పుడు అందరినోటా ఒకేమాట...ప్రియా సచ్‌దేవ్...ఈ మధ్యనే వచ్చిన లక్స్ యాడ్‌లో కరీనా పక్కన కనిపించిన అమ్మాయి. చాలా బాగా క్లిక్కయింది ఆ యాడ్. ప్రియా ఇప్పుడు సోలో యాడ్స్‌కూడా చేస్తోంది. అది టివిఎస్ వాళ్ల స్కూటీ యాడ్. అంటే పిల్ల బ్రాండ్ మోడల్ అయిపోతోందన్నమాట. ప్రియను ఉత్తేజపరిచే మరో యాడ్ త్వరలోనే బుల్లితెరమీద దర్శనమివ్వనున్నది. అది రెడ్ ఎవరెడీ యాడ్. వాళ్ల బ్రాండ్ అంబాసిడర్ బిగ్ బి కదా... అదీ సంబరం. ప్రియాకు సినిమాల్లో కూడా అవకాశాలు వస్తున్నాయి. కానీ తొందరపడటంలేదు. మాంచి కమ్మర్షియల్ సెటప్‌కోసం ఎదురుచూస్తోంది. అదీ దగ్గర్లోనే వుంది.

''మీ బిడ్డ బెమ్మంగారు పుట్టిన తిదినచ్చిత్తరంలోనే పుట్టినాడు. వీడు చేసే పనులన్నీ లోకానికి ఇచ్చిత్తరంగా వుంటాయి'' అని చెప్పినాడు.

ఆ మాటని పట్టించుకోలేదు గోపిని కిష్టయ్య, ఆదెమ్మ.

వెంటవెంటనే బిడ్డలు పుట్టడంతో గిలకోడ్ని గాలికి వదిలేసినారు. నీళ్ళు పోసేవాళ్ళు గాదు. గుడ్డలు మార్చేవాళ్ళు గాదు. వేళకొచ్చి ఇంటి ముందు నిలబడితే అన్నంపెట్టేవాళ్ళు. నిద్దరొస్తే పంచన ముడుక్కునేవాడు.

వాడు చేసే పనులు చూసేవాళ్ళకి భలే ఇచ్చిత్తరంగా వుండేవి.

కోడిగుడ్డిని పైకి ఎగరేసి కరెంటు తీగమింద నిలబెట్టేవాడు. చప్పట్లు కొట్టి దోసిలిపడితే తీగమింద నిలబడిన కోడిగుడ్డు టపక్కమని చేతుల్లో పడేది. సలసలా కాగే నూనెలో చెయ్యిపెట్టి అత్తిరాసాల్ని తీసుకోని తినేవాడు.

టెంకాయిని నెత్తికేసి కొట్టుకుంటే రాయికి కొట్టినట్టు రెండు వొప్పులయ్యేది.

ఎంతదూరమైనా కాళ్ళతో కాకుండా తల కిందులై గొల్లభామ మాదిరి చేతులమింద నడుచుకోని పొయ్యేవాడు.

ఒగరోజు రంగంపేటకు పోయింది చిన్నవ్వ.

గిలకోడ్ని గాలికి వదిలెయ్యడం చూసి భలే బాధపడింది. వాడికి రోజూ నీళ్ళు పోసి, వుతికిన గుడ్డలు తొడిగి, వేళకు అన్నంపెట్టి బడికి పంపిస్తే పిచ్చికుదురుకుంటుందని చెప్పి పెదబ్బ వాళ్ళ ఊరికి పిలుచుకోని వచ్చింది.

గిలకోడు వచ్చినాడని పిలకాయలకి భలే కుశాలగా వున్నింది.

వాళ్ళకి మానెక్కి నేరేడు పండ్లు కోసిచ్చేవాడు. పంగలకర్రతో గురిచూసి కొట్టినాడంటే కొమ్మ మింద వాలిన గువ్వ ముదరకొచ్చి కిందపడేది. పిల్లోల్లను కొత్తచెరువులోకి పిలుచుకొనిపొయ్యి బంకమన్ను పిసికి బొమ్మలు చేసిచ్చేవాడు.

పొద్దున్నే లేస్తానే ఉడుకుడుగ్గా గిలకోడికి నీళ్ళు పోసేది చిన్నవ్వ. వుతికిన గుడ్డలు తొడిగి ఆము దంపెట్టి తలదువ్వితే కడిగిన ముత్తెంలా వుండేవాడు. మల్లెపువ్వు మాదిరి పలవరించేవాడు.

పలక చేతికిచ్చి పెదబ్బతోపాటూ బడికి పంపించేది.

సుబ్బారెడ్డి అయివోరు అ, ఆలు పలకమీద రాసిస్తే దిద్దేవాడుగాదు. నాలికతో తడిచేసి నాకేసేవాడు. పలక తిప్పి అవే అక్షరాలను క్షణాల్లో రాసి చూపించేవాడు. పాఠం ఒక్కసారి చెపితే చాలు నిద్దట్లో లేపి అడిగినా గడగడా కండ్లు మూసుకుని అప్పజెప్పేవాడు.

ఆ పొద్దు ఏం జరిగిందంటే,

సుబ్బారెడ్డి అయివోరు పాఠం చెపుతుంటే గిలకోడు దూలంకల్లా ఎగమల్లుకోని వున్నేడు.

''రేయ్... పైకిలెయ్యి. నేను పాఠం చెప్తావుంటే నువ్వు దూలంకల్లా ఏందివాయ్? ఎగజూసుకోని వుండావు?'' అన్నేడు బెత్తం చూపించి.

గిలకోడు పైకిలేసి చొక్కాయి గుడ్డ నోట్లో పెట్టుకుని చేతులు కట్టుకున్నేడు.

''సార్.. దూలంసార్'' అన్నేడు మల్లా దూలంకల్లా ఎగజూస్తా.

''ఏమైంది దూలానికి? విరిగి మిందపడితిందా ఎట్లా? ఇంకోసారి దూలం మాటెత్తినావంటే తల కిందులుగా దూలానికి ఏలాడదీస్తా. పొయ్యి గోడ కుర్చీ వెయ్యి'' అన్నేడు బెత్తంతో రెండు పీకులు పీకి.

పాపం దెబ్బలు తగిలిన చోట గోక్కుంటా గోడ కుర్చీ వేసినాడు. పాఠం వినకుండా మాటిమాటికి దూలాన్నే చూస్తా నిలబడినాడు.

పాఠం వినకుండా పిలకాయలు గిలకోడ్ని చూస్తా వుండారు. వాడు దూలంకల్లా ఎగజూస్తే వీళ్ళు చూసి కిసుక్కున నవ్వుతా వున్నేరు.

సుబ్బారెడ్డి అయివోరికి కోపం వచ్చి గిలకోడ్ని పిలిచి నాలుగు పీకులు పీకి బయటికి పొయ్యి ఎండలో వొంటికాలిమింద నిలబడమన్నేడు.

పైన ఎండ మండిపోతా వుండాది. కాలికింద ఇసిక బొబ్బలెక్కిస్తా వుండాది. చెమటలు పట్టేసినాయి.

కాలు మార్చి కాలుమింద నిలబడతా.

''సార్ దూలం సార్. సార్ దూలం సార్'' అని అరస్తానే వున్నేడు.

ఇంతలో వొంటికి బెల్ కొట్టినారు.

పిలకాయలంతా పుట్టపగిలి ఈసుళ్ళు బయట కొచ్చినట్టు ఒకర్ని ఒకరు తోసుకుంటా, దొబ్బుకుంటా బయటకొచ్చినారు. వాళ్ళతోపాటూ సుబ్బారెడ్డి అయివోరు గూడా బయటకొచ్చినాడు.

అంతే,

పిలకాయలంతా బయటకు రావడం ఫెళ ఫెళమని దూలం విరిగి కప్పుకూలిపోవడం కన్ను మూసి తెరిసేంతలో జరిగిపోయింది.

అయివోరు, పిలకాయలు వెనక్కి తిరిగి చూసి నిశ్చలకపొయినారు.

చుట్టుపక్కల చేనుల్లో, మళ్ళల్లో పనులు చేసుకుంటా వుండేవాళ్ళు పరిగెత్తుకుంటా వచ్చినారు. రైసుమిల్లుకాడ వుండే దొరవారు నాయనస్వామినాయుడు గూడా పరిగెత్తుకుంటా వచ్చినాడు.

వచ్చి చూస్తే ఏముండాది? కప్పు కూలిపోయింది.

కొంతమంది బడిలోకి దూరబొయినారు.

''పిలకాయలకి ఏం ప్రమాదం లేదులే! అందరూ బయటికి వచ్చేసినాకనే కప్పుకూలిపోయింది'' అని చెప్పి గిలకోడికల్లా చూసినాడు

సుబ్బారెడ్డి అయివోరు.

పాపం వాడు వొంటికాలి మింద నిలబడి అయివోరికెల్లా బయం బయంగా చూసినాడు. దెగ్గిరికి పొయ్యి గుండెలకేసి అదుముకోని వలవలా ఏడ్చినాడు సుబ్బారెడ్డి అయివోరు.

ఎందుకట్లా ఏడుస్తున్నాడో ఎవురికీ అర్తం కాలేదు.

* * *

ఒగరోజు బొజ్జత్త వాళ్ళ దేసిపు ఆవుని దొంగలు తోలుకోని పొయినారు.

కరువుకాలంలో గూడా ఆవుపాలు అమ్ముకోని ఏ దిగులు, యసనం లేకుండా బతకతా వున్నింది బొజ్జత్త.

ఆ పొద్దు ఈదిలోకొచ్చి లబలబా నోరు కొట్టుకోవడం మొదలెట్టింది.

''వాళ్ళని నల్ల నాగుపాము కరవా! వాళ్ల చేతులకి లక్కవాయి కొట్టా! వాళ్ళని బాటకాడ గంగమ్మ వచ్చి ఎత్తుకోనిపోనూ! మంగళాచెరువులో గుంతలోడి బతికుండగానే వాళ్ళని పూడ్చిపెట్టా!'' అని కొంచేపు తిట్లదండకం ఎత్తుకునింది.

''ఇంగెట్లా బతికేదిరా దేవుడా! నా బిడ్డా నేను ఏ బాయిలోనైనా దూకి సస్తాము. అంత ఇసం తీసుకోని సస్తాము. ఆ చింతచెట్టుకి ఉరిపోసుకోని సస్తాము'' అని కొంచేపు ఏడుపునెత్తుకునింది.

''మ్మేయ్... మంగళారం పూట మా ఇంటి ముందు ఎందుకు ఏడుస్తావు? రేపు తలపలపేటలో సగినం చూపిద్దాం. అంజనం వేసి ఎక్కడుండాదో

**''వాళ్ళని నల్ల నాగుపాము కరవా! వాళ్ల చేతులకి లక్కవాయి కొట్టా! వాళ్ళని బాటకాడ గంగమ్మ వచ్చి ఎత్తుకోని పోనూ! మంగళాచెరువులో గుంతలోడి బతికుండగానే వాళ్ళని పూడ్చిపెట్టా!'' అని కొంచేపు తిట్ల దండకం ఎత్తుకునింది.**

చెప్తాడు. లేసిపొయ్యి అన్నం తినుపో'' అని కసురుకునింది చిన్నవ్వ.

మరుసటిరోజు తలపలపేటలో అంజనం వేసి చూస్తే,

ఆవును కోసి బాగాలేసినట్టు కనిపించింది. అది చూసి బొజ్జత్త గుండెలు బాదుకోని అక్కడ్నే తెలివితప్పింది.

ఇంటికొచ్చిందేగాని మనిషిలో మనిషిగాలేదు. జొరంతో పడకేసింది.

''ఇంగెట్టా బతికేదిరా సామి!'' అని ఉలిక్కిపడి ఉలిక్కిపడి కలవరించేది.

బోడి డాక్టరొచ్చి సూదులేసి, మాత్తరలు మింగించి పోతా వుండాడు.

ఎందుకో ఆ పొద్దు బొజ్జత్త పక్కనొచ్చి చొక్కాయి నమలతా కుర్చున్నాడు గిలకోడు.

''ఏమత్తా పడుకోనుండావు? జొరమొచ్చిందా?'' అని అడిగినాడు.

కండ్లు తెరిసి చూసిందేగాని పిచ్చినాబట్టతో ఏం మాటల్లే అని గొమ్మున వున్నింది.

''నీ ఆవు చచ్చిపోలేదు బొజ్జత్త. బతికే వుండాది'' అన్నేడు.

''పిచ్చినాబట్టా లెయ్యి... జొరమొచ్చి నేను చస్తావుంటే ఆవు మాటెత్తి నన్ను ఇంగా కుంగదీసి చంపుతావా?'' అని కసురుకునింది.

''లేదు బొజ్జత్తా ఆవు బతికే వుండాది. రేపు సుక్కురారం వచ్చేస్తుంది చూడు!'' అన్నేడు చొక్కాయి నమలతా తల ఎగరేసి.

''రేయ్ గిలకోడా! ఇక్కడ నీకేంపని? పొయ్యి ఆడుకోపో'' అనింది చిన్నవ్వ గంజికాచుకోనొచ్చి.

''లేదు చిన్నవ్వా. ఆవు బతికే వుండాది. వచ్చేస్తుంది'' అని తలకాయ వాలేసినాడు.

''ఏం చేసేదవ్మా ఈ పిచ్చినాకొడుకుతో. ఆవును చంపేసి బాగాలు ఏసేసినారు. ఇంకెక్కడ వస్తుంది?'' అనింది చిన్నవ్వ.

''వస్తుందిలే! చూసుకోనుండు'' అని చెప్పేసి పరిగెత్తుకుంటా యలబారిపొయినాడు.


వాడినోటి మహత్యమేమోగాని సుక్కురారం పొద్దున్నే లేచి చూస్తే గొడ్ల కొట్టాంలో ఆవు కనిపించింది.

బొజ్జత్త పరిగెత్తుకుంటా పొయ్యి ఆ విషయాన్ని పల్లెంతా పలకకొట్టి చెప్పింది.

అందరూ ఆవును చూసేదానికి వచ్చినారు.

బొజ్జత్త గిలకోడ్ని చూసింది. గిలకోడు బొజ్జత్తని





చూసి నవ్వినాడు.

దెగ్గిరికి పొయ్యి గుండెలకేసి అదుముకోని కండ్ల నీళ్ళు పెట్టుకునింది.

''నేను చెప్పలా! ఆవు వస్తుందని'' అన్నేడు చొక్కాయి గుడ్డ నమలతా.

''నిజమే నాయనా! నువ్వు చెప్పినట్టే ఆవు వచ్చింది. నీ వాక్కు బెమ్మవాక్కురా!'' అనింది బొజ్జత్త.

* * *

పెదబ్బ వాళ్ళ ఇంటివెనక మల్లె పందిరి వున్నింది.

రోజుకి పదిశేర్ల పూలు కాసేది. ఎప్పుడో లచ్చుమమ్మ కాపరానికి వచ్చినప్పుడు అమ్మగారి ఇంటినుంచి తీగ తెచ్చి నాటింది.

అది కుంటడు నేలంతా పందిరికి అల్లుకోని పూలు ఇరగాస్తా వున్నింది.

కరువులో నీళ్ళు లేక సచ్చిపొయింది. ఎండకు ఎండిపొయ్యి తీగ గలగలమంటా వున్నింది.

ఆపొద్దయితే చిన్నవ్వ బలే బాధపడింది. అన్నంగూడా తినలేదు. పందిరిని పీకేసేదానికి బుద్ధిరాక అట్నే వదిలేసి వున్నేరు.

గిలకోడికి ఏం బుద్ధిపుట్టిందో ఏమో! రోజూ ఎండిపొయిన మల్లెపందిరికి కడివెడు నీళ్ళు పోసేవాడు.

చూసినవాళ్ళు ''పిచ్చోడుగదా!'' అని నవ్వుకొనేవాళ్ళు.

వాడు ఇవేమీ పట్టించుకునేవాడు గాదు. రోజూ ఒగ కడవ నీళ్ళు పోస్తానే వున్నేడు.

కొంతకాలానికి ఎండిపొయిన మల్లె పందిరి పాణం పోసుకునింది. చిగుళ్ళు వెయ్యడం మొదలెట్టింది. పచ్చపచ్చని ఆకులు తొడిగింది. తెల్లతెల్లని మొగ్గలేసింది.

సాయంత్రమైతే పూలు పూసి గమగమా పలవరిస్తా వున్నింది.

మల్లెపందిరి దగ్గరకొచ్చి పూల పరిమళాన్ని గుండెల నిండా పీల్చుకునింది చిన్నవ్వ.

కడవతో చెట్టుకి నీళ్ళు పోస్తా వుండె గిలకోడ్ని చూసింది. వాడు చిన్నవ్వని చూసి నవ్వినాడు.

చిన్నవ్వ గిలకోడ్ని దగ్గరికి తీసుకునింది.

''ఒరేయ్ గిలకోడా! నీ చేతిలో ఏం మహత్యముందోగానీ నువ్వు నీళ్ళుపొయ్యగానే సచ్చిన చెట్టు మల్లా బతికింది. నువ్వు పిచ్చోడివి కాదురా! పిచ్చోడి రూపంలో వున్న దేవుడివి'' అని కండ్ల నీళ్ళు పెట్టుకునింది చిన్నవ్వ.

పెదబ్బ వాళ్ళింట్లో రాజిగాడని జీతగాడు వుండేవాడు. వాళ్లది మాదిగ పల్లె.

రాత్తిరయితే గొడ్ల కొట్టాంలోనే పొనుకునేవాడు. కడుగు నీళ్ళ తొట్టికాడ అన్నం పెడితే తినేవాడు. పైకెత్తి చెంబుతో నీళ్ళు పోస్తే తాగేవాడు.

ఒగరోజు ఏమైందంటే,

రాజిగోడికి సంగటి పెట్టింది కల్లేణమ్మ. సద్దిపడిపొయిన వంకాయ కూరుంటే వేసింది.

అరుగుమింద కుర్చోని తింటావుండే గిలకోడు చూసి, గబుక్కున లేచిపొయ్యి రాజిగోడి గిన్నెలో వుండే వంకాయని ఎత్తుకోని తినేసినాడు. ఆపాట్నే పొయ్యి గిలకోడ్ని పట్టుకోని నాలుగు దెబ్బలేసింది కల్లేణమ్మ.

ఆపొద్దుట్నుంచి గిలకోడికి గూడా వేరుగా తట్ట పెట్టింది.

ఈ విషయం వాళ్ళ నాయనకి తెలిసి రంగంపేట నుంచి వచ్చినాడు.

''నా బిడ్డకు మీరు తినే తట్టల్లో కాకుండా తనీగా తట్ట తీసిస్తారా! నా బిడ్డేమన్నా కడజాతోడా?'' అని 'ఢాంఢూం' అని ఎగిరి గిలకోడ్ని రంగంపేటకు పిలుచుకొని పొయినాడు.

ఇంగా కొన్నాళ్ళు వున్నుంటే పిచ్చి కుదిరున్నుగదా! అని చిన్నవ్వ భలే బాధపడింది.

* * *

రోషమొచ్చి పిలుచుకోని పొయినాడేగాని గిలకోడి ఆలనాపాలనా పట్టించుకోలేదు. మల్లా గాలికి వదిలేసినారు.

పిచ్చి ముదిరిపొయింది. దానికితోడు వాయిరోగం తిరగతోడింది.

ఒగరోజు,

కల్లేణి డ్యామ్‌కాడ టౌను బస్సుకు వెనక నిచ్చెన పట్టుకోని ఎక్కినాడు. ఎవురూ చూల్లేదు. వాయివు వచ్చి కాళ్ళూ చేతులూ గుంజుకుంటా నిచ్చెన పట్టుకున్న చేతుల్ని వదిలేసినాడు. కాళ్ళు నిచ్చెనలో ఇరుక్కోనిపొయినాయి.

బస్సు కిలోమీటరు దూరం ఈడ్చేసింది. వీపంతా కొట్టకపొయ్యి ఎముకలు బయటపడినాయి. రొయ్యాసిపత్రిలో చేర్పించినారు.

నెలరోజులు గోర్చిగోర్చి సచ్చిపొయినాడు.

వెలమ కులస్తుల్లో పెళ్లికాకుండా చనిపొయిన వ్యక్తిని వీరుడ్ని చేస్తారు.

వేపచెట్టు కింద అలికి ముగ్గులు పెట్టినారు. మూడు ఇటుక రాళ్ళను కడిగి, వీబూది పట్టీలు తీసి శిలల్ని చేసి నిలబెట్టినారు.

ఆ శిలల ముందు పట్టాకత్తిని పిడితో సహా భూమిలోకి గుచ్చినారు. కత్తిని కడిగి వీబూది పట్టీలు తీసి కొనకి నిమ్మకాయ గుచ్చినారు.

కొత్తొడ్లతో పరవాణ్ణం వండినారు. కొత్తగుడ్డలు పెట్టినారు.

కోడి గొంతుకోసి పట్టా కత్తిమింద నెత్తురు పట్టినారు. నిమ్మకాయమింద నుంచి చిక్కని నెత్తురు దిగకారింది.

ఆవిధంగా పదకొండో నెలలో గిలకోడ్ని గూడా వీరుడ్ని చేసినారు.

వీరుడైన గిలకోడు అప్పుడప్పుడు చిన్నవ్వ వొంటిమింద వాలి సగినం చెప్పేవాడు.

ఎవరివైనా ఆవులు కనిపించకపోతే పోవిడి చెప్పేవాడు.

కడుపు నొప్పులకు, వంటి నొప్పులకు, వాయిరోగాలకి సగినం చెప్పి మంత్రం వేస్తే నొప్పులు చేత్తో తీసేసినట్టు తగ్గిపొయ్యేవి.

వానలు ఎప్పుడు కురస్తాయో! ఎప్పుడు పంటలు పెట్టుకోవచ్చో చెప్పేవాడు. సగినం చెప్పి రైతుని కంటికి రెప్పలా కాపాడుకునేవాడు.

అని కత చెప్పింది గుడిసింటి దీపం.

## మగాళ్లంటేనే ఇష్టం

**జా**వెద్ అఖ్తర్ కూతురు జోయా ఇప్పుడు వార్తల్లో వ్యక్తి అయిపోయింది. సైఫ్ అలీ ఖాన్ కొంప కొల్లేరవడానికి ఈ పిల్లే కారణమని కిట్టనివాళ్లు ఆడిపోసుకుంటున్నారు. కానీ జోయా మాత్రం 'ఖోయా ఖోయా చాంద్' పాట పాడుకుంటూ తన మొదటి సినిమా 'లక్ బై చాన్స్' షూటింగ్ సన్నాహాల్లో వుంది. రాబర్ట్ ఆల్ట్‌మన్ 'ది ప్లేయర్' దీనికి ప్రేరణ. జోయా తీసే సినిమా మహిళా చిత్రం కాదుట. తనే చెప్పింది. వుమెన్ ప్రోటగానిస్ట్‌లంటే ఈ పిల్లకు అసహ్యం. తనకు మగజాతంటేనే ఇష్టంట. ఈ సినిమాకు తమ్ముడు ఫర్హాన్ కథ అందిస్తున్నాడు. ఓ కామెడీ వేషంకూడా వేస్తున్నాడు. ఇదొక అందమైన పాటలపందిరి అంటోంది జోయా. డాన్సులు కూడా అదురుతాయంటోంది. పాటలకు తండ్రి వుండనే వున్నాడుగా... దేఖేంగే...